క్లుప్తంగా

దీక్షకు తరలివెళ్లిన టీబీజీకేఎస్ నాయకులు



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్ చేపట్టిన దీక్షకు శ్రీరాంపూర్ నుంచి ఆ యూనియన్ నాయకులు తరలివెళ్లారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బుధవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కార్మికులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. పెండింగ్ మెడికల్ బిల్లు వెంటనే విడుదల చేయాలని, మెడికల్ రూల్స్ మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం డైరెక్టర్లను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో భద్రాది కొత్తగూడెం జిల్లా మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండి రమేష్, నాయకులు అన్వేష్ రెడ్డి, ముత్యాల రమేష్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



విగ్రహాలను నీటితో శుద్ధి చేస్తున్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నంనూర్ పునరావాస కాలనీలోని నూతన ఆలయంలో కొనసాగుతున్న ప్రతిష్ఠాపనా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు బుధవారం విగ్రహాలకు శుద్ధి మహా సంప్రోక్షణ, వాస్తు, మూలమంత్ర హోమములు, దాన్యాధి, పుష్పాధి, పలాది, శయ్యాధివాసములు నిర్వహించారు.

వైభవోపేతం.. ఆలయ వార్షికోత్సవం

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై శ్రీఅయ్యప్ప ఆలయ 32వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం వైభవోపేతంగా జరిగాయి. గణపతి పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శత కళశపూజలు, హోమాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమా చార్యులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు సరిచేసుకోవాలి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

లక్సెట్టిపేట: విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ఆపరేటర్లు సరిచేయాలని మంచిర్యాల రూరల్ విద్యుత్‌శాఖ డీఈ ఎండీ కైసర్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్తంభాలకు ఉన్న వైర్లు విచ్చలవిడిగా ఉంటున్నాయని, విద్యుత్ లైన్‌మెన్‌తో మాట్లాడి ఎవరికి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే, వెంటనే తెలియజేయాలని సూచించారు. అనంతరం సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏడీఈ ప్రభాకర్, ఏఈ గణేశ్, బాపు, లచ్చన్న, సిబ్బంది, కేబుల్, ఇంటర్నెట్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

వనమహోత్సవంపై సమీక్ష

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహించే వనమహోత్సవం కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సిద్ధం కావాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. లక్ష 4వేల మొక్కలు గ్రామాల్లో నాటాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, డిప్యూటీ రేంజ్ అధికారి రూపేష్, ఎఫ్ఎస్‌వో బేగ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

7న వైద్య శిబిరం

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల, ఆర్‌వీఎం ఆసుపత్రి సిద్దిపేట ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని మంచిర్యాల పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా గల ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సభ్యులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఈ శిబిరంలో గుండె జబ్బుల వైద్యులు, క్యాన్సర్, జనరల్ ఫిజీషియన్, నరాలు, జనరల్ సర్జన్, జీర్ణకోశ వ్యాధులు, రేడియాలజిస్టు, మూత్రపిండాల వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు.

★ ప్రయాణికుల పాట్లు..!



తాండూర్: మండల కేంద్రంలో బస్ షెల్టర్ సౌకర్యం లేక ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. గంటల తరబడి ఎండలో నిరీక్షించాల్సి వస్తుందని వాపోతున్నారు. 363జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నేషనల్ హైవే అథారిటీ అధికారులు నూతన బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు వ్యాపార వాణిజ్యాల సముదాయాల ఎదుట నిలబడుతూ అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా మెరుగైన బస్సు షెల్టర్ల సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

★ శిలాఫలకానికే పరిమితం



మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ శివారులో దొనబండ నుంచి పెద్దంపేట వెళ్లే రహదారి మధ్య గతేడాది నవంబర్ 1న హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణానికి సీఆర్ఆర్ ఫండ్ కింద రూ.75లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఈ హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కానీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జ్ శిథిలావస్థకు చేరదంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ప్రజలు జంకుతున్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

★ బోర్డు సరిచేయరూ..!



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో గల తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్ మంచిర్యాల బోర్డు కొన్ని రోజుల క్రితం కిందపడింది. రోజులు గడుస్తున్నా, బోర్డును సరిచేయకపోవడంతో, బోర్డుపై మట్టి, చెత్తా చెదారం చేరుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహల చిత్రాలతో కూడిన బోర్డు కాగా, అది కిందపడి రోజులు గడుస్తున్నా, దానిని సరిచేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డును సరిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

★ అసౌకర్యంగా ఓపెన్ జిమ్



శ్రీరాంపూర్: కార్మికులు, ఓసీపీ పునరావాసిత కాలనీవాసుల సౌకర్యార్థం నస్పూర్ నాగార్జున కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో సింగరేణి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. రెండు నెలల రోజుల క్రితం జీఎం శ్రీనివాస్ ప్రారంభించారు. జిమ్ అడుగు భాగంలో ఫ్లాట్ ఫాం నిర్మించకుండానే పరికరాలు ఏర్పాటు చేశారు. సరైన లైటింగ్ లేదు. ప్రహరీ, ఫెన్సింగ్ లేకపోవడంతో పశువులు లోపలికి వస్తున్నాయి. అసంపూర్తిగా నిర్మించి ప్రారంభించడంపై కార్మికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లాట్ ఫాం కట్టించి, ఫెన్సింగ్ లేదా ప్రహరీ నిర్మించాలని, లైటింగ్ అమర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



నెన్నెల: దరఖాస్తులు స్వీకరిస్తున్న బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

మందమర్రిరూరల్/దండేపల్లి/నెన్నెల/వేమనపల్లి/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు రెండో రోజు కొనసాగాయి. నెన్నెల మండలంలోని ఆవుడంలో 53, చిన్నవెంకటాపూర్‌లో 29, సింగాపూర్‌లో 3 దరఖాస్తులు వచ్చినట్లు బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తెలిపారు. చెన్నూర్ మండలంలోని బుద్దారంలో 1, బీరెల్లిలో 3దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ మల్లికార్జున్ పేర్కొన్నారు. వేమనపల్లి మండలంలోని జిల్లెడలో 33, కల్మలపేటలో 5 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. దండేపల్లి మండలంలోని కుందేళ్‌పహాడ్, లక్ష్మీకాంతపూర్ గ్రామాల్లో 21దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. మందమర్రి మండలంలోని పొన్నారంలో 2, చిర్రకుంటలో 10 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ శర్మ తెలిపారు. హాజీపూర్ మండలంలోని నంనూర్, నర్సింగాపూర్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. సదస్సుల్లో డిప్యూటి తహసీల్దార్లు, ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నెన్నెలలో రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు ఇవ్వాలని, సకాలంలో సమస్యలను పరిష్కరించాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ఆదేశించారు. దరఖాస్తు ప్రక్రియను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం రెండో రోజు తహసీల్దార్ భోజన్న ఆధ్వర్యంలో, కోనూరు గ్రామ పంచాయతీలో నాయబ్ తహసీల్దార్ అంజయ్య ఆధ్వర్యంలో భూ భారతి గ్రామసభలు నిర్వహించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. మొత్తం 25దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. యంఆర్‌ఐలు రాజలింగు, కమల, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో బుధవారం రైతులకు జీలుగ, పెసర విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విడుతల వారీగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు సంక్షేమ పథకాలు అందజేసి, అన్ని విధాల సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జనార్దన్, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, సయ్యద్ ఇస్హాక్, సుభాష్ రెడ్డి, శంకరయ్య, మాణిక్యం, కరుణాకర్, షాకీర్‌ఆలీ, సతీష్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి

శ్రీరాంపూర్: రాష్ట్రంలో పెండింగ్ ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి ఉదయ్‌మాదిగ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పెండింగ్ బిల్లులు కూడా ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

ఎల్‌వోసీ అందజేత

రామకృష్ణాపూర్: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న మహిళకు చికిత్స నిమిత్తం ఎల్‌వోసీ మంజూరైంది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎనగందుల స్వాతి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల చికిత్స పొందే పరిస్థితి లేదని తెలుసుకున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ప్రభుత్వం తరుపున రూ.5లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్, మొట్టె సుధాకర్, అనిల్‌కుమార్, శివకుమార్‌లు బుధవారం ఎల్ఓసీని మహిళకు అందించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్ శివాజీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందించారు. డ్రైయినేజీలు సక్రమంగా క్లీన్ చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తుందని, విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, కొన్ని వీధుల్లో వీధిలైట్లు లేక ప్రజలు చీకట్లోనే రాత్రుళ్లు గడపాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు త్వరగా పరిష్కరించేలా చూడాలని, లేనిపక్షంలో కార్యాలయాన్ని రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్‌వర్ధన్, జోగుల శ్రీదేవి, కర్రె లచ్చన్న, గాజుల ప్రభాకర్, రాజబాబు, నాగుల రాజన్న, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, విజయ్, వెంకన్న, దుర్గాప్రసాద్, రవీందర్, శివ, బింగి సత్యనారాయణ, పవన్ పాల్గొన్నారు.

బీసీ చైతన్య సదస్సు విజయవంతం చేయండి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించే బీసీ చైతన్య సదస్సు విజయవంతం చేయాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ అవ్వారు వేణుకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో బుధవారం బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి జిల్లా కేంద్రంలో ఈ నెల 22న బీసీ చైతన్య సదస్సు నిర్వహించడానికి ఏర్పాటు చేశామని, ఈ కార్యక్రమానికి బీసీ మేధావుల ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కనుకుట్ల మల్లయ్య, విశ్రాంత ఎంఈవో కొండయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలకంఠేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేయాలి



ఏసీపీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జైపూర్: వేమనపల్లి మండలంలోని చామనపల్లికి చెందిన దళిత రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపిన అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ డిమాండ్ చేశారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం ఏసీపీ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సమగ్ర విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, గోవర్ధన్, కేశవరెడ్డి, రాజులాల్, శివయ్య తదితరులు ఉన్నారు.

‘పాడి’బాట..!

- ఉద్యోగం మానేసి డెయిరీ ఫాం వైపు అడుగులు
- రూ.లక్షల్లో సంపాదిస్తూ.. లాభాలు గడిస్తూ
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సురేందర్



సురేందర్ పెంచుతున్న గేదెలు

జన్నారం: ఎంటెక్ చదివి ఉద్యోగంతో కెరీర్ ప్రారంభించినా, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ చేయాలని నిర్ణయించుకొని ‘పాడి’ బాట పట్టాడు. రూ.లక్షల్లో సంపాదిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న సురేందర్‌పై ‘సాక్షి’ ప్రత్యేక కథనం... జన్నారం మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన జాడి పోచన్న, కృపాల కుమారుడు జాడి సురేందర్. తండ్రి పంచాయతీ రాజ్ ఏఈగా ఉద్యోగం చేసి రిటైర్ అవ్వగా, కృపా అంగన్‌వాడీ టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. సురేందర్ 2014లో బీటెక్, 2017లో ఎంటెక్ పూర్తి చేశాడు. 2018లో సైట్ ఇంజినీర్‌గా ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు. అప్పుడే సురేందర్‌కు నెలకు రూ.50వేల వేతనం ఉంది. అయినా తనకు ఉద్యోగం చేయడం సంతృప్తినియ్యలేదు. సంవత్సరంలోనే ఉద్యోగం మానేశాడు. తండ్రి సంపాదించిన మూడు ఎకరాల భూమి ఉంది.. డైరీఫాం పెట్టి స్వగ్రామంలోనే ఉండాలని నిర్ణయించుకున్నాడు. 2020లో 4గేదెలతో డైరీ ఫాం ప్రారంభించి, ప్రస్తుతం 40గేదెలతో డైరీ ఫాం సాగుతుండగా, గొర్రెలు, నాటుకోళ్ల పెంపకంతో మరింతగా సక్సెస్ అయ్యాడు.

కుండ పెరుగు సరికొత్త ఆలోచన..

అన్ని దుకాణాల్లో పెరుగు, మజ్జిగ, లస్సీ విక్రయిస్తారు. అందుకు భిన్నంగా ఆలోచించి వ్యాపారం చేయాలనే ఆలోచనతో ఆరు నెలల క్రితం మండల కేంద్రంలో ఒక దుకాణాన్ని ప్రారంభించాడు. కుండలోనే పెరుగు తయారు చేయడం, మట్టి పాత్రలలోనే లస్సీ, మజ్జిగ విక్రయించడం వంటివి ప్రత్యేక గుర్తింపునిచ్చింది. వ్యాపారంలో ప్రస్తుతం నెలకు రూ.3లక్షలు సంపాదిస్తుండగా, ఖర్చులు పోను రూ.1.40లక్షలు ఆదాయం వస్తున్నట్లు సురేందర్ తెలిపాడు.

సెల్ఫ్ జాబ్ సంతృప్తినిస్తుంది



ప్రభుత్వ ఉద్యోగమో, ప్రైవేట్ ఉద్యోగమో చేస్తే ఇంత సంతృప్తి ఉండేది కాదు. నిత్యం కుటుంబ సభ్యులకు దూరంగా పని చేయాల్సి ఉండేది. అది నచ్చకనే సొంతంగా వ్యాపారం చేయాలనే ఆలోచనతో డైరీ ఫాం ప్రారంభించాను. సక్సెస్ అయింది. ఇష్టంతో కష్టపడి పనిచేస్తే ఏదైనా విజయాన్నిస్తుంది. పశువులపై ఇష్టంతోనే డైరీ ఫాం ప్రారంభించి సక్సెస్ అయ్యాను. సరికొత్త ఆలోచన ప్రారంభించిన కుండ పెరుగుపై ప్రజలు మక్కువ చూపుతున్నారు.

\- జాడి సురేందర్

ప్రజలకు అందుబాటులో ఎంపీ వంశీకృష్ణ



మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతంగా పనిచేసున్నాడని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఎంపీగా వంశీకృష్ణ సంవత్సర కాలమైన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం పాతబస్టాండ్‌లోని కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, స్త్రీశక్తి భవన నిర్మాణంపై వినతిపత్రం ఇవ్వడానికి వచ్చిన ఆర్పీల్లో ఒకరు చాలాసేపు వేచి చూసి అస్వస్థతకు గురి కాగా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

మంచిర్యాలటౌన్: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూదరి ప్రభాకర్, నస్పూరు మున్సిపల్ మాజీ చైర్మన్ వేణు, బీఆర్ఎస్ నాయకులు కర్రె శంకర్, బలికొండ రమేశ్, సీపీఐ నాయకులు చంద్రశేఖర్, కళిందర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఏ.లాల్‌కుమార్ పాల్గొన్నారు.

‘బడిబాట’ విజయవంతం చేయాలి

జైపూర్/చెన్నూర్/బెల్లంపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాటను విజయవంతం చేయాలని బెల్లంపల్లి ఎంఈవో జె.పోచయ్య, జైపూర్ ఎంఈవో బి.శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 6నుంచి 19వ తేదీ వరకు మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. చెన్నూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గెర్రె కాలనీలో బడిబాట నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరణ

జన్నారం: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్సై గొల్లపెల్లి అనూష పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆమె ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. సమస్యలు ఏవైనా ఉంటే ప్రజలు నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. పోలీస్ సిబ్బంది స్వాగతం పలికారు.

సంక్షిప్త వార్తలు

అక్రమ కట్టడాలు తొలగించండి

నస్పూర్: అక్రమ కట్టడాలను తొలగించాలని రిటైర్డ్ సింగరేణి కార్మికుడు దూడ లచ్చయ్య బుధవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో మొరపెట్టుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని కృష్ణమూర్తి నగర్‌లో 40ఏళ్లుగా నివాసం ఉంటున్నాని, ఇటీవల కొందరు వ్యక్తులు వారి ఇళ్ల ముందు రోడ్డుపై అక్రమ కట్టడాలు నిర్మించుకున్నట్లు ఆరోపించారు. దీంతో వాహనదారులకు ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మట్టి ట్రాక్టర్లు పట్టివేత

జైపూర్: మండలంలోని గంగిపల్లిలో అనుమతి లేకుండా రవాణా చేస్తున్న నాలుగు మట్టి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు బుధవారం ఎస్సై శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా, అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో తనిఖీ చేసినట్లు చెప్పారు.

సింగరేణి ఆసుపత్రుల్లో మందులు కరువు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే డిస్పెన్సరీ, రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రుల్లో పలు వ్యాధులకు సంబంధించిన మందులు లేక కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. ఏరియాలోని ఏఐటీయూసీ ఆఫీస్‌లో బుధవారం మాట్లాడారు. కార్మికులకు దీర్ఘకాలిక వ్యాధులైన గుండె జబ్బులు, కిడ్నీ, బీ పీ, షుగర్, తదితర వ్యాధులకు సంబంధించి మందులు లేక ప్రైవేట్ మందుల షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడొద్దు

తాండూర్: పంటల సాగులో రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడొద్దని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోట శివకృష్ణ సూచించారు. మండలంలోని గంపలపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు తిరుపతి, తాండూర్ మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి ధనలక్ష్మి, శంకర్ పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

తాండూర్: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. తాండూర్ పోలీసు స్టేషన్ పరిధిలో రేచిని గ్రామంలో బుధవారం రోజున ఫర్టిలైజర్ దుకాణాలను పోలీసు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.